సాక్షి పెద్దపల్లి

ఆదివారం । 19 । మార్చి । 2023



బల్దియాకు చేరిన కంపాక్టర్

రామగుండం కార్పొరేషన్‌కు రెండున్నరేళ్ల తర్వాత కొత్త ట్రక్ మౌంటెడ్ గార్బేజ్ కంపాక్టర్ వాహనం చేరుకుంది. టెండర్ పొందిన కాంట్రాక్టర్ బల్దియా కార్యాలయం వెనుక పార్కింగ్ వాహనాన్ని పార్కింగ్ చేయించారు.

8లో▸



సజావుగా ఇంటర్ పరీక్ష

పెద్దపల్లిరూరల్: జిల్లాలో నిర్వహించిన ఇంటర్ సెకండియర్ ఇంగ్లిష్ పరీక్షకు 5,670 మంది హాజరు కావాల్సి ఉండగా 5,509మంది హాజరయ్యారని ఇంటర్ నోడల్ అధికారి కల్పన తెలిపారు. 161మంది గైర్హాజరయ్యారని వివరించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
26.0/19.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

సభ్యులు రాక జెడ్పీ సమావేశం వాయిదా



డిప్యూటీ సీఈవో వెంకట చైతన్య

జ్యోతినగర్: జెడ్పీ సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని ఉద్యోగ వికాస కేంద్రం మిలీనియం హాల్‌లో శనివారం జెడ్పీ సమావేశం ఉంటుందని ప్రకటించిన విషయం తెల్సిందే. అయితే సభ్యులెవరూ హాజరుకాకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు జెడ్పీ డిప్యూటీ సీఈవో వెంకట చైతన్య ప్రకటించారు. సమావేశం ఎప్పుడు నిర్వహిస్తారో త్వరలో తెలియజేస్తామని పేర్కొన్నారు.

ఎల్లంపల్లి వారధి గేట్లు మూసివేత



గేట్లు మూసివేసి ఫ్లెక్సీ కట్టిన అధికారులు

రామగుండం: ఎల్లంపల్లి ప్రాజెక్టుపై ఉన్న రెండు జిల్లాల వారధి గేట్లను శనివారం మూసివేశారు. ఈనెల 20 నుంచి అన్ని వాహనాల రాకపోకలను పూర్తిగా నిషేధిస్తున్నట్లు అధికారులు తెలిపారు. గేట్ల మూసివేతతో రెండు జిల్లాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లకు గురికానున్నారు. ఇటీవల ఎల్లంపల్లి ప్రాజెక్టుకు ఇరువైపులా తారు రోడ్డు నిర్మాణం జరగడంతో రవాణా సులువు కానుందని ప్రయాణికులు ఊరట చెందారు. అయితే ప్రస్తుతం ఇరిగేషన్ అధికారులు తీసుకున్న నిర్ణయంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై నీటిపారుదలశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బండ విష్ణుప్రసాద్‌ను 'సాక్షి' వివరణ కోరగా.. ప్రాజెక్టు భద్రతా కారణాల దృష్ట్యా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాహనాల రాకపోకలను నిషేధిస్తున్నట్లు పేర్కొన్నారు.

కేంద్రం ప్రజావ్యతిరేక విధానాలు మానుకోవాలి



మాట్లాడుతున్న ముత్యం రావు

జ్యోతినగర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలు మానుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యం రావు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక యూనియన్ కార్యాలయంలో గీట్ల లక్ష్మారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఏప్రిల్ 5న ఢిల్లీలో జరిగే మజ్దూర్ కిసాన్ సంఘర్షణ ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. కేంద్రప్రభుత్వం మతోన్మాద, కార్పొరేట్ అనుకూల విధానాలను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ అఖిలభారత సంఘాలు సీఐటీయూ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం చలో పార్లమెంట్‌కు పిలుపునిచ్చాయని పేర్కొన్నారు. నిత్యావసర ధరలను నియంత్రించాలని, ప్రజాపంపిణీ వ్యవస్థను విస్తరించి పటిష్ట పరచాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ నిలిపివేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కోశాధికారి ఎం.రామాచారి, కన్వీనర్ లక్ష్మారెడ్డి, నాయకులు తుంగపిండి మల్లేశ్, ఎన్టీపీసీ యునైటెడ్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్ష, కార్యదర్శులు ఈదునూరి భూమయ్య, సారయ్య, నాయకులు గుండు కనకయ్య, భిక్షపతి, రాజేశ్వర్, సునీత పాల్గొన్నారు.

సీఎమ్మార్ వేగవంతం చేయాలి

పెద్దపల్లిరూరల్: యాసంగికి సంబంధించిన సీఎంఆర్ రైస్ డెలివరీ త్వరితగతిన పూర్తి చేయాలని అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. కలెక్టరేట్ సమావేశమందిరంలో శనివారం పౌర సరఫరాల శాఖ కమిషనర్ కార్యాలయం ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం అదనపు ఎస్పీ ప్రభాకర్, సభ్యులు లక్ష్మారెడ్డితో కలిసి సమీక్షించారు. జిల్లాలో 1450 మెట్రిక్ టన్నులకు పైగా పెండింగ్ ఉన్న రైసుమిల్లులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకుని సకాలంలో డెలివరీ అయ్యేలా చూడాలన్నారు. మరో గిడ్డంగిని కేటాయించారన్నారు. మిల్లులకు నిరంతర విద్యుత్ సరఫరా ఉంటుందని, మిల్లులకు మరమ్మతు అవసరమైతే వెంటనే చేయించి నిరంతరం నడిపించాలని మిల్లర్లను ఆదేశించారు. డీఎస్ఓ తోట వెంకటేశ్, డీటీలు, మిల్లర్లు పాల్గొన్నారు.

సండే స్పెషల్

మన బలగం

సినిమా బృందంతో దర్శకుడు యెల్దండి వేణు



సిరిసిల్ల: ఉమ్మడి కుటుంబ వ్యవస్థ దూరమైన నేటి రోజుల్లో మానవ సంబంధాలను గొప్పగా ఆవిష్కరించి అందరితోనూ కన్నీరు పెట్టించిన బలగం సినిమా రాజన్న సిరిసిల్ల జిల్లా పరిసరాల్లో చిత్రీకరించుకుంది. సిరిసిల్ల జిల్లాకేంద్రానికి చెందిన యెల్దండి వేణు కమెడియన్‌గా సుపరిచితుడు. ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన బలగం సినిమా నిండా ఇక్కడి పల్లెలు.. స్థానికులే నటించారు.

- వెండితెరపై మెరిసిన సిరిసిల్ల పల్లెలు
- సినిమా ఆసాంతం ఇక్కడే చిత్రీకరణ
- నటనలో ఆకట్టుకున్న స్థానికులు
- కన్నీరు పెట్టించిన 'పక్షి' సన్నివేశం

ఆత్మీయతల కలయిక..

తల్లికి పుట్టి, పిల్లలుగా ఉన్నప్పుడు కలిసి మెలిసి ప్రాణంగా బతికిన అన్నాదమ్ముళ్లు, అక్కాచెల్లెళ్లు పెద్దవాళ్లై పెళ్లి అవగానే చిన్నచిన్న విషయాలు, ఆస్తి తగాదాలకు కోపాలు పెంచుకుని.. హద్దులు గీసుకుని ఏళ్లకేళ్లు బతుకుతుంటారు. ఈ సినిమాలో ఇంటికొచ్చిన అల్లుడికి విలువ ఇవ్వడం లేదని, 'పూలుగ బొక్క'తో మొదలైన పంచాయితీ 20ఏళ్లు కూతురును తల్లిగారింటికి దూరం చేసింది. తన చెల్లిపై ప్రేమ ఉన్నా బావపై కోపంతో ప్రేమను అణచివేసుకుని మనసులో దుఃఖించిన వైనం గుండెలను హత్తుకుంటుంది. ప్రాణంపోయిన వ్యక్తికి పక్షికి పెడితే.. చనిపోయిన మనిషికి తృప్తి ఆ మటన్, చికెన్‌లో కాదు.. మానవ సంబంధాల్లో ఉంటుందని పక్షి ముట్టని వైనాన్ని అద్భుతంగా ఆవిష్కరించారు. కొడుకులు, కూతురు కలిశాకే పక్షి ముట్టిన తీరు కన్నీరు పెట్టిస్తుంది.

సిరిసిల్ల చుట్టే సినిమా..

'బలగం' సినిమా షూటింగ్ 70శాతం సిరిసిల్ల చుట్టూనే సాగింది. సినిమాలో కనిపించే పెద్ద ఇల్లు కోనరావుపేట మండలం కొలనూర్‌లోనిది. కల్లు మండువ ధర్మారం, శవ ఊరేగింపు కనగర్తి, గంభీరావుపేట మండలం భీముని మల్లారెడ్డిపేట, పక్షికి పెట్టే చోటు ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద చిత్రీకరించారు. తంగళ్లపల్లి, జిల్లెల్ల, సిరిసిల్ల శివారులోని జగ్గారావుపల్లె, సర్దాపూర్, కోనరావుపేట మండలం నాగారం, సుద్దాల గ్రామాల్లో షూటింగ్ చేశారు. చంద్రంపేట, జగ్గారావుపల్లె డప్పు కళాకారులు నృత్యాలు చేశారు. మానేరు వాగు, కోనరావుపేటలోని మూలవాగులోనూ సన్నివేశాలు చిత్రీకరించారు.



కోనరావుపేట మండలం కొలనూర్‌లోని ఇల్లు



సిరిసిల్లకు సినిమాకు వచ్చిన వృద్ధులు



సిరిసిల్లలో 'బలగం' ప్రీ రిలీజ్ ఫంక్షన్

అందరూ స్థానికులే..

సినిమాలో యెల్దండి వేణు, డాక్టర్ వడ్డెపల్లి కృష్ణ (సినీ పాటల రచయిత), కీసరి నర్సింగం(నాగారం), పోరండ్ల మురళీధర్ (మాజీ సర్పంచ్ జిల్లెల్ల), ఆకునూరి దేవయ్య(గాయకుడు), జీఎల్.నాందేవ్(సంగీత దర్శకులు), కాయితి బాలు (సామాజిక వేత్త), నక్క శ్రీకాంత్ (గాయకుడు), బొడ్డు భాస్కర్, డి.సంజీవ్ (గాయకుడు), విద్యాసాగర్, రవి, కాయితి మిథున్, కాయితి శశాంక్, కాయితి కనకవ్వ, యాపిల్, కల్యాడపు రిత్విక్, కౌశిక్, పావని, మనస్విని నటించారు. ఇంకా సినిమాలో కనిపించే సైడ్ క్యారెక్టర్లు కూడా జిల్లా వాసులే.

ఇది నా డ్రీమ్ ప్రాజెక్టు..



సిరిసిల్లలో కూరగాయలు అమ్మిన నేను.. సినిమాలో నటుడిని కావాలనే కసితో హైదరాబాద్ వెళ్లాను. 25 ఏళ్లుగా అనేక సినిమాల్లో నటించాను. టీవీ షోల్లో పాల్గొన్నాను. కానీ మనసులో ఎక్కడో వెలితి ఉండేది. మా కుటుంబంలో జరిగిన ఘటనలు.. నాకు తెలిసిన కొన్ని అంశాలతో కథ రాసుకున్న. ఐదేళ్లుగా ఇదే పనిపై ఉన్న. ఇది నా డ్రీమ్ ప్రాజెక్టు.. సక్సెస్ చాలా సంతోషాన్ని ఇచ్చింది. – **యెల్దండి వేణు, సినీ దర్శకుడు**

నాటకాలు వేశాను



మాది హుజూరాబాద్ మండలం జూపాక. నేను బీఏ, బీఈడీ చేశాను. టీచర్‌గా పనిచేస్తూ.. కల్చరల్ విభాగానికి ఇన్‌చార్జిగా ఉన్నాను. నేను అనేక నాటకాలు వేశాను. ఇప్పటివరకు 35 సినిమాల్లో నటించాను. 'బలగం' సినిమా మంచి గుర్తింపునిచ్చింది. సంతోషంగా ఉంది. నాది ఇంకో సినిమా 'ముత్తయ్య' విడుదల కావాల్సి ఉంది. – **కేతిరి సుధాకర్‌రెడ్డి, జూపాక, హుజూరాబాద్**

లొకేషన్లు చూడడానికి వచ్చి..



మా అబ్బాయి శ్రీనివాస్ సిరిసిల్లలో అడ్వకేట్. అతనికి సినిమా దర్శకుడు వేణు స్నేహితుడు. మా ఊరులో సినిమా తీసేందుకు లొకేషన్లు చూడడానికి వచ్చి సినిమాలో నటించే అవకాశం కల్పించారు. గ్రామ సర్పంచ్ పాత్ర పోషించాను. మంచి సినిమాలో నటించడం చాలా సంతోషంగా ఉంది. – **కీసరి నర్సింగం, నాగారం**

నటించడం మొదటిసారి..



నేను నటించడం ఇదే తొలిసారి. గతంలో 'జ్యోతి', 'యమలోకంలో తెలంగాణ' వంటి సినిమాల్లో పాటలు పాడాను. గాయకుడిగా అనేక పాటలు పాడాను. కానీ సినిమాలో నటించడం తొలిసారి. మంచి సినిమాలో ఓ పాత్ర చేయడం ఆనందంగా ఉంది. వల్లు పట్టే పాత్రను ఇచ్చిన దర్శకుడు వేణుకు ధన్యవాదాలు. – **ఆకునూరి దేవయ్య, గాయకుడు, సిరిసిల్ల**

తెరపై చూసుకోవడం తొలిసారి



బలగం సినిమాలో పంచాయితీ పెద్దగా నటించడం సంతోషంగా ఉంది. సంగీత దర్శకుడిగా అనేక జానపదాలకు బాణీలు కట్టాను. ఎన్నో పాటలకు ప్రాణం పోశాను. వేణు చిత్రీకరించిన సినిమాలో నటించడం, తెరపై నన్ను నేను చూసుకోవడం, స్నేహితుల అభినందనలు సంతోషాన్ని ఇచ్చింది. – **జీఎల్.నాందేవ్, సిరిసిల్ల**

లాక్‌డౌన్ తరువాత ఇదే రికార్డు



సినిమాకు సిరిసిల్లలో కలెక్షన్లు రికార్డు స్థాయిలో వచ్చాయి. 16 రోజుల్లో రూ.22.43 లక్షలు వసూలైంది. 23వేల మంది సినిమా చూశారు. లాక్‌డౌన్ తరువాత ఇంత పెద్ద హిట్ సినిమాలు లేవు. ఇంకా హౌస్‌ఫుల్‌గానే నడుస్తోంది. పల్లెటూర్ల నుంచి చాలా మంది వచ్చి చూస్తున్నారు. నా 35 ఏళ్ల అనుభవంలో చిన్న సినిమా పెద్దహిట్ కావడం మొదటి సారి. – **కంచర్ల వెంగయ్య, థియేటర్ మేనేజర్**

సంతోషంగా ఉంది



మాది వరంగల్ జిల్లా దుగ్గొండి. మేం కళాకారులం. పాటలు పాడుతూ.. ఊరూరు తిరుగూ జీవనం సాగించే వాళ్లం. మా పాటలు విని డైరెక్టర్ వేణు మాకు అవకాశం కల్పించారు. 'బలగం' సినిమాలో పాట పాడడం చాలా సంతోషంగా ఉంది. సినిమాతో మాకు గుర్తింపు వచ్చింది. చాలా మంది మమ్మల్ని సన్మానించి, ఆర్థికంగా ఆదుకున్నారు. – **బుర్రకథ కళాకారులు కొమురవ్వ, మొగిలయ్య, దుగ్గొండి**

మోదీది ఫాసిస్టు పాలన

- ప్రజాస్వామ్య పాలన వచ్చేవరకూ పోరాటం
- పాత కార్మిక చట్టాలు అమలు చేయాల్సిందే..
- ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు టి.శ్రీనివాస్..



ఐఎఫ్‌టీయూ ర్యాలీలో నాయకులు, కార్యకర్తలు

జ్యోతినగర్: దేశంలో మోదీ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకొచ్చాక ఫాసిస్టు పాలన సాగుతోందని, కాశ్మీర్‌ను విభజించి.. 370 ఆర్టికల్ రద్దు చేసి.. ఎన్ఆర్‌సీ చట్టం చేసి.. ముస్లింలను అభద్రతకు గురిచేస్తోందని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జేవీ.చలపతిరావు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు టి.శ్రీనివాస్ తెలిపారు. ఐఎఫ్‌టీయూ 8వ జిల్లా మహాసభల సందర్భంగా ఎన్టీపీసీలో ర్యాలీ తీశారు. అనంతరం టీవీ గార్డెన్స్‌లో జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. కార్మికవర్గం పోరాటాల ద్వారా సాధించుకున్న లేబర్ చట్టాలను రద్దుచేసి నాలుగు కోడ్‌లుగా మార్చిందని తెలిపారు. ప్రజావ్యతిరేక ధోరణులను (ఐఎఫ్‌టీయూ)వ్యతిరేకిస్తోందని తెలిపారు. పాత కార్మిక చట్టాలను అమలు చేయాలని, కొత్త కార్మిక చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

సింగరేణి కార్మికులకు ఐఎఫ్‌టీయూ అండగా

సింగరేణి కార్మికులకు ఐఎఫ్‌టీయూ అండగా నిలుస్తోందని, బొగ్గు బావుల్లో యాజమాన్యం నిరంకుశ పని పద్ధతులను మార్చడానికి పోరాడుతున్నామని తెలిపారు. రామగుండం ఎరువుల కర్మాగారం, ఎన్టీపీసీ రెగ్యులర్ కార్మికుల హక్కుల సాధనకు కృషి చేశామని పేర్కొన్నారు. నూతన స్ఫూర్తితో జిల్లా, రాష్ట్ర కేంద్ర మహాసభలను విజయవంతం చేసుకోవాలని, ప్రపంచ కార్మికులారా ఏకంకండి అనే స్ఫూర్తితో కార్మిక వర్గం ఒక తాటిపైకి తీసుకురాగలగాలని సూచించారు. ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు లేబర్ గేట్ నుంచి టీవీ గార్డెన్ వరకు ఎర్ర జెండాలతో ర్యాలీ చేపట్టారు. అరుణోదయ కళాకారుల ఆటపాటలు ఆకట్టుకున్నాయి. అనంతరం జరిగిన బహిరంగ సభకు ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు ఈదునూరి నరేష్ అధ్యక్షత వహించారు. సమావేశంలో సీపీఐ (ఎంఎల్)న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి కే.రాజన్న, నాయకులు ఐ.కృష్ణ, వెంకన్న, చిలుక శంకర్, అశోక్, బుచ్చయ్య పాల్గొన్నారు.



కాల్వశ్రీరాంపూర్‌లో కురుస్తున్న వర్షం

జిల్లాలో రాళ్ల వర్షం



రాళ్లతోకూడిన వర్షం

ధర్మారం: మండలకేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో శనివారం సాయంత్రం రాళ్లవర్షం కురిసింది. జనాలు దుకాణాల్లోకి పరుగులు తీశారు. మేడారం, సాయంపేట, నర్సింహులపల్లి, బొట్లవనపర్తి, ఖిలావనపర్తిలో పది నిమిషాల పాటు వర్షం కురిసింది.

కాల్వశ్రీరాంపూర్‌లో

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్‌లో భారీ వర్షం కురిసింది. గురువారం రాత్రి కురిసిన వర్షానికి మొక్కజొన్న పంట నేలవాలిన విషయం తెల్సిందే. తాజాగా కురిసిన వర్షానికి మరింత నష్టం వాటిల్లే అవకాశముందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

సుల్తానాబాద్‌లో అరగంట పాటు వర్షం

సుల్తానాబాద్: అకాలవర్షంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. శనివారం ఉరుములతో ప్రారంభమై.. ఒక్కసారిగా రాళ్లవర్షం కురిసింది. ఇప్పటికే మొక్కజొన్నతోపాటు మామిడి పూత రాలిపోగా.. ఇటుక బట్టీల నిర్వాహకులకు నష్టం వాటిల్లుతోంది. రాజీవ్ రహదారి వెంబడి ఒకసారి రాళ్లవర్షం కురవడంతో ద్విచక్రవాహనదారులు పరుగులు తీశారు.

ఓదెలలో

ఓదెల: మండలంలోని కొలనూర్, కనగర్తి, గుంపుల, గూడెం, పొత్కపల్లి, ఇందుర్తిలో శనివారం వడగండ్ల వర్షం కురిసింది. నష్టపోయిన పంటలను సర్వే చేయాలని రైతులు జిల్లా ఉన్నతాధికారులను కోరుతున్నారు. పొత్కపల్లికి చెందిన మాదాసి ప్రభాకర్ రేకుల షెడ్డుపై చెట్టు కూలింది. దీంతో కుటుంబసభ్యులు ఒక్కసారిగా పరుగులు పెట్టారు. ఎవరికీ ఎలాంటి అపాయం జరగలేదు.

లబ్ధిదారులకు న్యాయం చేయాలి



ధర్నా నిర్వహిస్తున్న ఎంఎస్.రాజ్‌ఠాగూర్, నాయకులు

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజ్‌ఠాగూర్
- ప్రధాన చౌరస్తాలో భారీ ధర్నా

గోదావరిఖని: డబుల్ బెడ్‌రూం ఇళ్లకు 2016లో ఎంపికైన 160మంది లబ్ధిదారులకు న్యాయం చేయాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్.రాజ్‌ఠాగూర్ కోరారు. శనివారం స్థానిక ప్రధాన చౌరస్తాలో భారీ ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ హయాంలోనే అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు వచ్చాయన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం ఇళ్లు కేటాయించకుండా ప్రజలను మోసం చేస్తోందన్నారు. పాత లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించాలని, లేకుంటే కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ధర్నా నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులను పోలీసులు స్టేషన్‌కు తరలించారు. నాయకులు, బొంతల రాజేశ్, మహంకాళి స్వామి, ముస్తాఫా, పెద్దెల్లి ప్రకాశ్, నాయకులు పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం

గోదావరిఖనిటౌన్: టీఎస్‌పీఎస్ ప్రశ్నాపత్రాల లీకేజీలను నిరసిస్తూ మక్కాన్‌సింగ్ ఆదేశాల మేరకు శనివారం ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి దాసరి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు పోలు భాస్కర్, ఎస్సీ సెల్ రామగుండం అధ్యక్షుడు తాళ్లపల్లి యుగేందర్, తిప్పారపు శ్రీనివాస్, రాజు, అజయ్, ఆనంద్, నగేష్, నరహరి, నరేందర్, సురేష్, భాస్కర్, పవన్ పాల్గొన్నారు.

అర్హులకే డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలి

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి



మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

పెద్దపల్లిరూరల్: అర్హులకే డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించాలని సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యుడు చాడ వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. జిల్లాకేంద్రంలో గౌతం గోవర్ధన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. 2014 నుంచి ఇప్పటివరకు ఇళ్లు పంపిణీ చేయలేదన్నారు. రేషన్‌కార్డులు, పింఛన్లు మంజూరు చేయాలని, సొంత స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణానికి రూ.3లక్షలు ఇస్తామంటోందని, దానిని రూ.5లక్షలకు పెంచాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బడావ్యాపార వేత్తలకు దోచిపెడుతోందని, ప్రజలపై పన్నుల భారం మోపుతోందని ఆరోపించారు. బీజేపి హఠావో.. భారత్‌బచావో నినాదంతో అంబేద్కర్ జయంతి నుంచి మే14 వరకు దేశవ్యాప్త ఆందోళనలు చేపడతామన్నారు. కార్యక్రమంలో నాయకులు కలవేన శంకర్, తాండ్ర శంకర్, మోహన్, స్వామి, సునిల్, మానస్ కుమార్, పెర్క సతీశ్, చంద్రగిరి ఉదయ్, రమేశ్, రాజరత్నం, శంకర్, చంద్రశేఖర్, శంకర్, పూసాల రమేశ్, రమ, గౌరమ్మ, రామస్వామి, రాకేశ్, శ్రీనివాసరెడ్డి తదితరులున్నారు.

బస్సులో నుంచి దూకిన మహిళ

రామగిరి(మంథని): కదులుతున్న బస్సులో నుంచి దూకిన ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. సెంటినరీకాలనీలో బంధువుల వివాహ వేడుకకు హాజరయ్యేందుకు పెద్దపల్లి మండలం దొంగతుర్తికి చెందిన కదారి పద్మ శనివారం పెద్దపల్లిలో మంథనికి వెళ్లే ఆర్టీసీ బస్సు ఎక్కింది. సెంటినరీకాలనీలో బస్సు ఆగి.. తిరిగి బయల్దేరిన కాసేపటికి.. హడావుడిగా గేటు వద్దకు వచ్చింది. ప్రయాణికులు, కండక్టర్ ఆగాలని చెబుతుండగానే ఒక్కసారిగా దూకేసింది. ఈ ఘటనలో పద్మ తలకు గాయాలయ్యాయి. స్థానికులు ఆమెను చికిత్స నిమిత్తం కరీంనగర్ తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపినట్లు బంధుల ద్వారా తెల్సింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని బస్సును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

బల్దియాకు చేరిన కంపాక్టర్

- రెండున్నరేళ్ల అనంతరం ప్రత్యక్షం
- విజిలెన్స్ విచారణతో అధికారుల అప్రమత్తం



బల్దియాకు చేరిన కొత్త కంపాక్టర్ వాహనం

కోల్‌సిటీ: రామగుండం కార్పొరేషన్‌కు రెండున్నరేళ్ల తర్వాత కొత్త ట్రక్ మౌంటెడ్ గార్బేజ్ కంపాక్టర్ వాహనం చేరుకుంది. టెండర్ పొందిన కాంట్రాక్టర్ బల్దియా కార్యాలయం వెనుక పార్కింగ్ వాహనాన్ని పార్కింగ్ చేయించారు. శానిటేషన్ విభాగానికి 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.ఏడు కోట్లతో టీఎస్ అగ్రోస్ ద్వారా పలు వాహనాలను కొనుగోలుకు 2020–21లో టెండర్ పిలిచారు. రూ.90 లక్షలతో రెండు కంపాక్టర్ వాహనాలకు టెండర్ ఇచ్చారు. ఒకదానిని మాత్రమే తెప్పించడంతో మరో వాహనం రాకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి. దీనిపై విజిలెన్స్ అధికారులు విచారణకు వస్తున్నారని తెలుసుకున్న అధికారులు, ప్రజాప్రతినిధులు రెండో కంపాక్టర్ తెప్పించడంపై ఒత్తిడి పెంచారు. శుక్రవారం రాత్రి హుటాహుటిన హైదరాబాద్ నుంచి తెప్పించారని తెలిసింది. అయితే వాహనాన్ని ఇంజినీరింగ్, శానిటేషన్ విభాగానికి అప్పగించలేదని సమాచారం. ఈ వాహనంపై అధికారులెవరూ సమాధానం చెప్పడంలేదు. వాహనాలకు గ్యారంటీ, వారంటీ సర్వీస్ బుక్స్ ఇవ్వకపోవడంతో అనేక వాహనాలకు బల్దియానే మరమ్మతు చేయిస్తోంది. ముందుగా తెప్పించిన కంపాక్టర్ కూడా నడిచింది కొద్దిరోజులే. అయినా తరచూ మరమ్మతు సమస్యలు ఎదురవుతున్నాయి. దానికి వారంటీ, గ్యారంటీ, సర్వీస్ బుక్ కంపెనీ ఇవ్వకపోవడంతో ఇటీవల సుమారు రూ.30వేలు ఖర్చు చేయాల్సి వచ్చింది. బల్దియా నుంచి మరో రెండు వాహనాలకూ రెండున్నరేళ్ల క్రితమే డబ్బులు చెల్లించారని, అయినా వాటిని ఇప్పటివరకు తెప్పించలేదని తెలిసింది. వీటిపైనా విజిలెన్స్ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

మన ఊరు–మన బడితో సకల వసతులు

- జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మండిగ రేణుక
- ధూళికట్ట ప్రాథమిక పాఠశాల ప్రారంభం



ధూళికట్టలో పాఠశాలను ప్రారంభిస్తున్నరేణుక, సర్పంచ్ కావేరి

ఎలిగేడు: రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు–మన బడి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా సకల వసతులు కల్పిస్తోందని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మండిగ రేణుక అన్నారు. ఎలిగేడు మండలం ధూళికట్ట పాఠశాలలో మన ఊరు–మనబడి కింద రూ.6,67,480తో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ లైట్లు, గ్రీన్‌బోర్డులు, కిచెన్‌షెడ్లు, డ్యూయెల్ డెస్కులు ఇలా పూర్తి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం సర్పంచ్ కావేరి, ఎంఈవోతో కలిసి పాఠశాలను ప్రారంభించారు. ఎంపీటీసీ ఇరుగురాల సావిత్రమ్మ, ఎంఈవో కవిత, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ నరినేని సుధాకర్‌రావు, హెచ్‌ఎం వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలు మెరుగుపడ్డాయి: డీఈఓ

గోదావరిఖనిటౌన్: తొలిమెట్టు ద్వారా ఉపాధ్యాయులు వినూత్న పద్ధతిలో బోధించడం ద్వారా విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు మెరుగుపడ్డాయని డీఈవో డి.మాధవి అన్నారు. గోదావరిఖని గాంధీనగర్‌లోని గాంధీపార్క్ ప్రాథమిక పాఠశాలలో శనివారం జరిగిన విద్యాకమిటీ, తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడారు. మన ఊరు – మన బడి ద్వారా పాఠశాలల్లో వసతులు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. హెచ్‌ఎం మధునయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి జక్కం శ్రీనివాస్, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు ఇజ్రాయిల్ పాల్గొన్నారు.

మనబడి పాఠశాలల సందర్శన

రామగుండం: అంతర్గాం మండలంలో మన ఊరు – మన బడి కింద అభివృద్ధి చేసి హెచ్‌ఎంలు రాచర్ల శ్రీనివాస్, దశరథం, ఓదెలు, సోమశేఖర్, ఫాతిమా తదితరులున్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలి



మాట్లాడుతున్న తోకల రమేశ్, నాయకులు

గోదావరిఖని: సింగరేణి, ఎన్టీపీసీ యాజమాన్యం కాంటాక్టు కార్మికులకు చట్టపరమైన వేతనాలు చెల్లించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు తోకల రమేశ్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. గతేడాది సెప్టెంబర్ 26న హైదరాబాద్ ఆర్‌ఎల్‌సీ సమక్షంలో చేసుకున్న ఒప్పందాన్ని సింగరేణి అమలు చేయడం లేదన్నారు. కార్మికులను బీగ్రేడ్ పరిధిలోకి చేర్చి వేతనాలు అమలు చేయాలని కోరారు. పేపర్ల లీకేజీపై ప్రభుతం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు జూపాక శ్రీనివాస్, గుజ్జుల సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో లైన్‌మన్ మృతి



మల్లయ్య (ఫైల్)

రామగిరి(మంథని): ముత్తారం మండలం ఇప్పల పల్లికి చెందిన లైన్‌మన్ బొద్దుల మల్లయ్య (51) గుండెపోటుతో మృతిచెందాడు. ఆయనకు శుక్రవారం ఛాతిలో నొప్పి రాగా.. కుటుంబ సభ్యులు కరీంనగర్‌కు తరలించారు. చికిత్స తీసుకుంటున్న సమయంలో గుండెపోటు రావడంతో మృతిచెందాడు. మల్లయ్య అంతర్గాం మండలంలో లైన్‌మన్. ఆయనకు భార్య భాగ్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు.

మాజీ కార్మికులకు న్యాయం చేయండి



కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని కలిసిన బీఎంఎస్ నాయకులు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం ఫర్టిలైజర్స్ కర్మాగారంలో మాజీ కార్మికులకు ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని బీఎంఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎస్.మల్లేశం, కాంట్రాక్టు లేబర్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కంది శ్రీనివాస్ కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. సానుకూలంగా స్పందించిన ఆయన త్వరలోనే ఆర్‌ఎఫ్‌సీఎల్ అధికారులతో చర్చించి న్యాయం చేసేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

'కస్తూరిబా'ను సందర్శించిన డీపీవో



బియ్యం నిల్వలను పరిశీలిస్తున్న డీపీఓ

రామగుండం: రామగుండంలోని కస్తూరిబా గాంధీ విద్యాలయాన్ని శనివారం డీపీవో, కుందనపల్లి ప్రత్యేక అధికారి చంద్రమౌళి ఆకస్మికంగా సందర్శించారు. తరగతి గదుల్లోకి వెళ్లి భోజనం నాణ్యత, టాయిలెట్స్ నిర్వహణపై విద్యార్థులతో మాట్లాడారు. వంటగదిలోని నిత్యావసర సరుకుల నిల్వలను పరిశీలించారు. విద్యార్థులను చదువులో ప్రోత్సహిస్తూ మెరుగైన ఫలితాలు సాధించాలని ప్రత్యేకాధికారి కవితకు సూచించారు. ఎంపీఓ మోతె సమ్మిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి కృష్ణ తదితరులున్నారు.

ప్రభుత్వ భూమిని పేదలకు పంచండి



భూమిని చదును చేస్తున్న ప్రజలు, నాయకులు

గోదావరిఖని: ప్రభుత్వ భూమిని పేదలకు కేటాయించాలని కోరుతూ శనివారం సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని జనగామ, మల్కాపూర్ శివారులో 36, 37, 38 సర్వే నంబర్‌లో గల 42ఎకరాలను ఇళ్ల స్థలాలకు కేటాయించాలని ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు యాకయ్య, కుమారస్వామి, రాజారెడ్డి, రామాచారి, శంకర్, మహేశ్వరి, జ్యోతి పాల్గొన్నారు.

అసోంలో రోడ్డు ప్రమాదం..

- విహారయాత్రకు వెళ్లిన మహిళలు
- తిరుగు ప్రయాణంలో డివైడర్‌ను ఢీకొట్టిన మినీ బస్సు
- ఓదెలకు చెందిన ఓ మహిళ దుర్మరణం



క్యాతం స్వప్న(ఫైల్)

ఓదెల: విహారయాత్రకు వెళ్లి తిరుగు ప్రయాణంలో అసోం రాష్ట్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓదెల మండలకేంద్రానికి చెందిన క్యాతం స్వప్న దుర్మరణం పాలైంది. మరో తొమ్మిదిమంది తీవ్రం గాయపడ్డారు. మృతురాలి భర్త క్యాతం సతీశ్ కథనం ప్రకారం.. ఓదెలకు చెందిన క్యాతం స్వప్న(40) భర్త క్యాతం సతీశ్ హైదరాబాద్‌లోని చర్లపల్లిలోని ఓ ప్రయివేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈనెల 4న వారు ఉంటున్న ఇంటి యజమానితోపాటు క్యాతం స్వప్న, మరోతొమ్మిది మంది కలిసి మినీ బస్సులో బద్రీనాథ్, కేదరీనాథ్, చార్‌ధాం, అసోం యాత్రలకు వెళ్లారు. శనివారం తిరుగుప్రయాణంలో అసోం వద్ద వీరు వస్తున్న మినీ బస్సు డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో క్యాతం స్వప్న అక్కడికక్కడే మృతిచెందింది. మరో తొమ్మిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. స్వప్న మృతిచెందిన విషయం తెలుసుకున్న బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. స్వప్న మృతదేహం ఇంకా హైదరాబాద్ చేరుకోలేదని సమాచారం.

డబ్బులు చెల్లించి ఖాతా ముగించుకోవచ్చు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి భారతి

మంథని: లోక్ అదాలత్ ద్వారా బ్యాంకులకు రుణపడి ఉన్న ఖాతాదారులు డబ్బులు చెల్లించి ఖాతాను ముగించుకోవచ్చని మండల న్యాయ విజ్ఞాన సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి భారతి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న యూనియన్ బ్యాంక్ అభ్యర్థన మేరకు రాష్ట్ర న్యాయసేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు శనివారం మంథని కోర్టులో ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించారు. జూనియర్ సివిల్ జడ్జి శ్రీధర్, అడిషనల్ జడ్జి స్వాతి, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చంద్రుపట్ల రమణకుమార్‌రెడ్డి, లోక్ అదాలత్ సభ్యుడు బొట్ల ఆంజనేయులు, న్యాయవాది ఆర్ల నాగరాజు ఉన్నారు.

ఇంటి వద్దకే శ్రీసీతారాముల తలంబ్రాలు

రామగిరి(మంథని): శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో నిర్వహించే శ్రీసీతారాముల కల్యాణ తలంబ్రాలను పోస్టల్ ద్వారా ఇంటివద్దనే అందిస్తామని గోదావరిఖని తపాలా శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. తలంబ్రాలకు రూ.450, ముత్యాల తలంబ్రాలకు రూ.150 చెల్లించాల్సి ఉంటుందని, వివరాలకు పోస్టాఫీస్‌లో సంప్రందించాలని కోరారు.

కేశోరాంలో అభ్యర్థుల గేట్ మీటింగ్



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న మనోహర్ రెడ్డి

పాలకుర్తి: బసంత్‌నగర్‌లోని కేశోరాం సిమెంట్ కర్మాగారంలో ఈనెల 20న జరగనున్న పర్మినెంట్ కార్మిక సంఘం ఎన్నికల ప్రచారం ముగిసింది. శనివారం చివరిరోజు కావడంతో అభ్యర్థులు గేట్ మీటింగ్ నిర్వహించారు.

అవినీతికి తావులేకుండా పనిచేస్తాం

కర్మాగారంలో రెండేళ్లలో తమ యూనియన్ అవినీతికి తావు లేకుండా వ్యవహరించిందని, భవిష్యత్‌లో కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి పోరాడుతామని అభ్యర్థి బయ్యపు మనోహర్ రెడ్డి అన్నారు. గతంలో పనిచేసిన యూనియన్లు ప్రతి పనికో రేటు నిర్ణయించి కార్మికుల నుంచి డబ్బులు వసూలు చేశాయని, తాము కార్మికులకు స్వచ్ఛందంగా సేవ చేశామని తెలిపారు.

రెండు యూనియన్లతోనే కార్మికులకు లాభం

కాంట్రాక్టు కార్మిక సంఘం అధ్యక్షుడిగా పనిచేస్తున్న తాను పర్మనెంట్ కార్మిక సంఘం ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని, రెండు యూనియన్లు కలిసి ఉంటే కార్మికుల సమస్యలు త్వరగా పరిష్కారం అవుతాయని కాంగ్రెస్ అభ్యర్థి సూర సమ్మయ్య అన్నారు. కార్మికుల పక్షాన నిరంతరం శ్రమిస్తున్న తనను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

కార్మిక హక్కుల కోసం పోరాడుతా..

కార్మిక సంఘం ఎన్నికల్లో తమను గెలిపిస్తే కార్మికుల సమస్యల కోసం రాజీలేని పోరాటం చేస్తామని బీఆర్‌ఎస్ అభ్యర్థి ఇంజపూరి నవీన్ అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉందని, తమ ప్యానల్‌ను గెలిపిస్తే కార్మికుల సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

కిండర్ గార్డెన్ గ్రాడ్యుయేషన్ వేడుకలు



గ్రాడ్యుయేషన్ వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్ బైపాస్‌లోని బిర్లా ఓపెన్‌మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శనివారం కిండర్‌గార్డెన్ గ్రాడ్యుయేషన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు చేసిన నృత్యాలు, పాటలు, నాటకాలు అలరించాయి. ఎం.సంతోష్ పిల్లల కోసం ప్రత్యేకంగా నిర్వహించిన పప్పెట్ షో ఆకట్టుకుంది. పాఠ్య, సహపాఠ్య కార్యక్రమాల్లో విజేతలైన విద్యార్థులకు పాఠశాల చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బబిత విశ్వనాథన్ బహుమతులు అందించారు.

వేతన ఒప్పందం అమలు చేయాలి



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

గోదావరిఖని: బొగ్గు గని కార్మికుల 11వ వేతన ఒప్పందాన్ని వెంటనే అమలు చేయాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. శనివారం పలు గనులపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. పూర్తిస్థాయి ఒప్పందం చేయకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని, కాంట్రాక్టీకరణ ద్వారా బొగ్గు ఉత్పత్తిపై నియంత్రణ ఉండాలని సూచించారు. సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలని, శ్రమకు తగిన వేతనం చెల్లించాలన్నారు. కాంట్రాక్టు కార్మికులకు ఈపీఎఫ్ కాకుండా సీఎంపీఎఫ్‌లో భవిష్యనిధి జమ చేయాలని, తద్వారా కాంట్రాక్టు కార్మికులకు ఆరోగ్య భద్రత, పెన్షన్, సామాజిక భద్రత తదితర విషయాలలో న్యాయం జరుగుతుందన్నారు. నాయకులు సారంగపాణి, ఆ కుల హరిణ్, సాయవేణి సతీశ్, రాపోలు వ జ్రవేణు, మాదాసు రవీందర్, పోతరాజు భా స్కర్, గుండెబోయిన భూమయ్య, గొడుగు స మ్మయ్య, చిగురు లక్ష్మణ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అంతర్గత రోడ్ల నిర్మాణంతో గ్రామాల అభివృద్ధి


భూమిపూజ చేస్తున్న జెడ్పీటీసీ, నాయకులు

జూలపల్లి: అంతర్గత రోడ్ల నిర్మాణంతో పల్లెలు అభివృద్ధి సాధిస్తాయని జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్ అన్నారు. మండలంలోని తేలుకుంటలో రూ.5 లక్షల ఉపాధిహమీ నిధులతో నిర్మించనున్న సీసీరోడ్డు పనులకు సర్పంచ్ పద్మశ్యాంతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాలను అన్ని రంగాలలో అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నర్సింగం, వార్డు సభ్యులు అడ్డగుంట శ్రీనివాస్, చిప్ప రమేశ్,తిరుపతి,పోచాలు,మంద లక్ష్మన్, పర్శ రాములు గ్రామస్తులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి


మాట్లాడుతున్న రాఘవులు

ఓదెల: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని డీఆర్డీఏ ఏపీడీ సత్యనారాయణ అన్నారు. శనివారం ఓదెల మండల పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛ భారత్ శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లడారు. గ్రామాల్లో పరిశుభ్రత, మరుగుదొడ్ల వాడకం గురించి ప్రజాప్రతినిధులకు, ఫీల్డ్అసిస్టెంట్లకు, అంగన్వాడీ కార్యకర్తలకు ఓడీఎస్ ప్రోజెక్టర్‌తో వివరించారు. కార్యక్రమంలోఎంపీపీ కునారపు రేణుకదేవి, డీఆర్డీఏ రాఘవులు, ఎంపీడీవో జి సత్తయ్య, ఎంపీవో వాజీద్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో లబ్ధికోసమే దళితబంధు


మాట్లాడుతున్న గొర్రె రమేశ్

రామగుండం: దళితులను మభ్యపెట్టేందుకే దళితబంధు ప్రవేశపెట్టారని, అంతర్గాం మండల కేంద్రంలో ప్రతిపాదిత ఐటీకారిడార్‌ను వెంటనే ప్రారంభించాలని, గ్రామాల వారీగా నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకే ×పల్లెబాట¥ చేపడుతున్నట్లు తెలంగాణ లేబర్ పార్టీ అధ్యక్షుడు గొర్రె రమేశ్ అన్నారు. శనివారం అంతర్గాంలో మాట్లాడారు. ఈనెల 24 వ తేదీ నుంచి మండలంలో ప్రతీ గ్రామంలో లేబర్ పార్టీ బృందం పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. గ్రామాల వారీగా సమస్యలపై నివేదిక రూపొందించి ప్రభుత్వాధికారులతో పాటు స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు వారిపై ఒత్తిడి పెంచుతామన్నారు. సమావేశంలో పార్టీ ప్రతినిధులు గాజుల రమేశ్, అఖిల్ వర్మ, పొన్నం రజిత, రాగల్ల సునీత, సాయితేజ తదితరులున్నారు.

వృత్తి, ఉపాధి శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి


శ్రీదేవిని సన్మానిస్తున్న సేవా సభ్యులు

రామగిరి: సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో అందిస్తున్న వృత్తి ఉపాధి ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని ఆర్జీ–3, ఏపీఏ ఏరియాల సేవా సమితి అధ్యక్షురాలు తన్నీరు శ్రీదేవి సూచించారు. సెంటినరీకాలనీలోని సింగరేణి సేవా భవన్‌లో మూడు నెలలుగా నిర్వహిస్తున్న బ్యూటీషియన్ కోర్సు ముగింపునకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శిక్షణ పొందిన మహిళలు స్వయం ఉపాధి పొందుతూ కుటుంబానికి ఆర్థికంగా తోడ్పడాలని సూచించారు. ఈ సందర్భంగా సేవా సభ్యులు శ్రీదేవిని సన్మానించారు. పర్సనల్ డీజీఎం విలాస్ శ్రీనివాస్ పొద్దార్, శిక్షణ మహిళలు పాల్గొన్నారు.

సీపీకి ఆహ్వానం

రామగుండం: అంతర్గాం మండల కేంద్రంలోని బర్మా, కాందీశీకుల ఆరాధ్యదైవం నూకాంబిక పోచమ్మ జాతర వేడుకల ఆహ్వానపత్రికను ఉత్సవ కమిటీ కన్వీనర్ జమ్ముల రామారావు శనివారం రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరికి అందజేశారు. మంగళవారం జరిగే ఉత్సవాలకు హాజరుకావాలని కోరగా, సీపీ సానుకూలంగా స్పందిస్తూ హాజరవుతానని హామీ ఇచ్చారన్నారు.


సుల్తాన్‌పూర్‌లో ఇంటివద్ద ఆర్చరీ ప్రాక్టీస్ చేస్తున్న తానిపర్తి చికితా


హర్యానాలో జరిగిన సోనిపత్‌లో ఆర్చరీ గేమ్‌లో చికితా

గురిపెడితే పతకమే!

- ఆర్చరీలో రాణిస్తున్న రైతుబిడ్డ
- ఒలింపిక్స్ లక్ష్యమంటున్న చికితా
- రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ చాటుతున్న సుల్తాన్‌పూర్ బాలిక

సండే స్పెషల్

ఎలిగేడు: పట్టుదల, క్రమశిక్షణ ఉంటే ఏ రంగంలోనైనా రాణించవచ్చని నిరూపిస్తోంది ఆర్చరీ క్రీడాకారిణి తానిపర్తి చికితా. ప్రస్తుతం ఇంటర్ చదువుతున్న చికితా 8వ తరగతిలో ప్రాక్టీస్ మొదలుపెట్టింది. ఆర్చరీలో ఒలింపిక్స్‌లో పతకమే లక్ష్యంగా సాధన చేస్తోంది. దేశం మొత్తంలో ఎనిమిది మంది ఎంపికవగా.. అందులో చికితా ఒకరు. రాష్ట్రం నుంచి ఏకైక క్రీడాకారిణి. ప్రస్తుతం ఆసియా క్రీడలు, వరల్డ్‌కప్, ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పతకాలే లక్ష్యంగా హర్యానాలోని సోనిపట్‌లోని భారత స్పోర్ట్స్ అథారిటీ కేంద్రంలో శిక్షణ పొందుతోంది.

రైతుకుటుంబం..

ఎలిగేడు మండలంలోని సుల్తాన్‌పూర్‌కు చెందిన రైతు కుటుంబానికి చెందిన తానిపర్తి శ్రీనివాసరావు– శ్రీలత దంపతులకు ఇద్దరు కూతురు చికితా, కుమారుడు యశ్వంత్ సంతానం. పిల్లలిద్దరూ ఆర్చరీ క్రీడాకారులే. చికితా ప్రస్తుతం గర్రెపల్లి మోడల్‌స్కూల్‌లో ఇంటర్ సెకండియర్ చదువుతోంది. తండ్రి ప్రోత్సాహంతో ఆర్చరీపై మక్కువ పెంచుకున్న చికితా నగునూర్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న సమయంలోనే కరీంనగర్ సీపీటీసీలో ఏడాదిపాటు శిక్షణ తీసుకుంది. చదువుకు ఆటంకం కలుగకుండా సెలవు రోజుల్లో ఇంటివద్ద ప్రాక్టీస్ చేస్తూ రామగుండం ఎన్టీపీసీలో జరిగిన ఎస్‌జీఎఫ్ క్రీడల్లో పాల్గొని రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచి అందరి దృష్టిని ఆకర్షించింది. నాలుగేళ్లలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పలు పోటీల్లో పాల్గొని సత్తాచాటింది.

ఆర్చరీ కాంపౌండ్ ఈవెంట్స్‌లో సత్తా ..

2021లో మహారాష్ట్రలోని అమరావతిలో జరిగిన నేషనల్ గేమ్స్‌లో పాల్గొని వ్యక్తిగత విభాగంలో సిల్వర్‌మెడల్, మిక్స్‌డ్ విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించింది. సీనియర్స్ విభాగంలో ఝార్ఖండ్‌లోని టాటానగర్‌లో, జమ్ముకాశ్మీర్‌లో జరిగిన పోటీల్లో పాల్గొని ప్రతిభ కనపరచింది. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన నేషనల్ గేమ్స్‌లో ఆర్చరీలో రాష్ట్రం తరపున చికితా మాత్రమే పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచింది. ఖేలో ఇండియా నేషనల్ గేమ్స్‌లో హర్యానాలోని పంచకులలో గత నవంబర్‌లో, గుజరాత్‌లో గత జనవరిలో జరిగిన పోటీల్లో సత్తాచాటింది. ఈ ఏడాది జరిగే మూడు ప్రపంచకప్ టోర్నీలు.. ప్రపంచ చాంపియన్‌షిప్, అనంతరం ఆసియా క్రీడల్లో ట్రయల్స్‌లో ఎంపికైన ఎనిమిది మందిలో టాప్–4లో నిలిచిన వారికి తొలి ప్రాధాన్యత లభిస్తుంది. రెండు ప్రపంచకప్ టోర్నీలు ముగిశాక టాప్–4లో నిలిచిన వారు విఫలమైతే తర్వాత టోర్నీకి 5 నుంచి 8 స్థానాల్లో నిలిచిన వారికి అవకాశం ఇస్తారు. అప్పుడు చికితాకు అవకాశం ఉంటుంది.

ఎక్విప్‌మెంట్ ఖర్చులు భారం

పేద, రైతు కుటుంబానికి చెందిన చికితాకు ఆర్చరీ ఎక్విప్‌మెంట్ కోసం ఇప్పటి వరకు దాదాపు రూ.12 లక్షల వరకు ఖర్చయిందని తండ్రి శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నాయని, ప్రభుత్వం ప్రోత్సహించాలని శ్రీనివాసరావు కోరుతున్నారు. ప్రభుత్వం ముందుకొచ్చి ఆదుకుంటే అంతర్జాతీయ స్థాయిలో దేశానికి గుర్తింపు తీసుకొస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

గోల్డ్ మెడల్ సాధిస్తా



రానున్న ఒలింపిక్స్‌లో దేశం తరపున ఎంపికై దేశానికి గోల్డ్ మెడల్ తీసుకురావడమే లక్ష్యం. ఒలింపిక్స్‌లో పాల్గొని భారతదేశ కీర్తి ప్రతిష్టలను అంతర్జాతీయ స్థాయిలో రెపరెపలాడేలా చేస్తాను. ప్రభుత్వం, దాతల సహకారం ఉంటేనే సాధ్యమవుతుంది.

– తానిపర్తి చికితా, ఆర్చరీ క్రీడాకారిణి

రామగుండం సమగ్ర అభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే కోరుకంటి చందర్


'డయల్ యువర్ ఎమ్మెల్యే'లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని: రామగుండం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా నాలుగేళ్లుగా పాలన కొనసాగిస్తున్నామని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీకోసం మీ ఎమ్మెల్యే, డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమంలో మాట్లాడారు. నియోజకవర్గం పరిధిలోని 20 మంది పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్పొరేషన్ అభివృద్ధి కోసం రూ.200 కోట్ల నిధులతో పాటు, పట్టణ ప్రగతి నిధులతో కార్పొరేషన్ పరిధిలోని వాడలు, డివిజన్ల సమస్యల పరిష్కారానికి కృషి చేశామన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ డాక్టర్ బంగి అనిల్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

స్కేటింగ్ క్రీడాకారులకు అభినందన

రామగుండం ప్రాంతంనుంచి రోలర్ స్కేటింగ్ క్రీడలో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు వేణు సాయి, సాయివిష్ణులను శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చందర్ అభినందించారు. కల్యాణలక్ష్మి చెక్కులు మంజూరైన ఏడుగురు లబ్ధిదారులకు ఎమ్మెల్యే కోరుకంటి చందర్ చెక్కులు వారి ఇంటికి వెళ్లి శనివారం మేయర్ తో కలిసి అందజేశారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

రామగుండం: పట్టణంలోని శ్రీరామపాదక్షేత్రం కొండపై శ్రీ వేంకటేశ్వరుడి ఆలయ నిర్మాణ పనులను రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ జన్మదినం రోజు ఆలయ నిర్మాణం చేపట్టాలని సంకల్పించామని, ఆలయ నిర్మాణం పూర్తి చేయడమే తన ముందున్న లక్ష్యమన్నారు.

స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యం

కోల్‌సిటీ: ప్రతీ ఇంటికి మిషన్ భగీరథ ద్వారా స్వచ్ఛమైన తాగునీటిని అందించడమే లక్ష్యమని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. స్థానిక 31వ డివిజన్‌లో శనివారం రూ.13 లక్షలలో చేపట్టిన తాగునీటి పైప్‌లైన్ పనులను నగర మేయర్ అనిల్‌కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అడ్డాల స్వరూప, రామస్వామి పాల్గొన్నారు.

నవీన్ ప్యానెల్‌ను గెలిపించాలి

పాలకుర్తి: కేశోరాం సిమెంట్ కర్మాగారంలో ఈనెల 20న జరగనున్న పర్మినెంట్ కార్మిక సంఘం ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున పోటీ చేస్తున్న పార్టీ మండల అధ్యక్షుడు ఇంజపూర్ నవీన్ ప్యానెల్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పిలుపునిచ్చారు.

వ్యక్తిత్వ వికాసం భవిష్యత్‌కు పునాది


విద్యార్థులతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ

రామగిరి: వ్యక్తిత్వ వికాసంతోనే ప్రతి విద్యార్థి భవిష్యత్‌కు పునాది పడుతుందని జెడ్పీటీసీ మ్యాదరవేని శారద సూచించారు. మండలంలోని బేగంపేట ప్రభుత్వ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో విద్యార్థులకు పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన మోటివేషన్ అండ్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్ శిక్షణా తరగతులను శనివారం ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవడం ద్వారా అనేక ప్రయోజనాలు పొందవచ్చని సూచించారు. ప్రతి విద్యార్థి ఉన్నతంగా చదివి ఇటు కన్నవారి కలలు, అటు ప్రోత్సాహం అందించే వారి ఆశయాలను నెరవేర్చాలని కోరారు. అనంతరం శ్రావణ్ పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు మ్యాదరవేని కుమార్ యాదవ్, నాయకులు కాపురబోయిన భాస్కర్, బుర్ర శంకర్, మారగోని కుమారస్వామి, ఎస్‌ఎంసీ చైర్మన్ కట్ట శ్రీనివాస్, హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆడబిడ్డలకు ప్రభుత్వ కానుక 'కల్యాణ లక్ష్మి'

- ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి


చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే దాసరి

జూలపల్లి: పేదింటి ఆడబిడ్డలకు అండగా ప్రభుత్వం కల్యాణలక్ష్మి కానుక అందిస్తోందని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో 42 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. పేదల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా సంక్షేమ పథకాలను సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. ఎక్కడా లేని సంక్షేమ పథకాల అమలుతో దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. అనంతరం మండలంలోని పెద్దాపూర్ పరిధిలోని సిల్లోనిపల్లెకు చెందిన ఆరుగురికి ఇంటిభూమి పట్టాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్, తహసీల్దార్ జయశ్రీ, ఎంపీడీవో వేణుగోపాలరావు, పీఏసీఎస్ చైర్మన్ కొంజెర్ల వెంకటయ్య, డీటీ అబూబాకర్, సర్పంచులు, ఎంపీటీసీలు నాయకులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన బల్దియా ఈఈ

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ ఈఈగా సుచరన్ విధుల్లో చేరారు. గతంలో రామగుండంలో ఈఈగా పని చేసిన సుచరన్, డిప్యూటేషన్‌పై సిరిసిల్ల మున్సిపాలిటీలో పనిచేశారు. ఇటీవల ప్రభుత్వం సుచరన్‌ను ఆదిలాబాద్ మున్సిపాలిటీకి బదిలీ చేయగా, తిరిగి రామగుండంలోనే సుచరన్ ఈఈగా చేరడం గమనార్హం.

స్టడీ మెటీరియల్ పంపిణీ

గోదావరిఖనిటౌన్: వీహెచ్‌ఆర్ వ్యవస్థాపక అధ్యక్షుడు వ్యాళ్ల హరీశ్ రెడ్డి జన్మదినం సందర్భంగా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న ముంజంపల్లి, మారేడుపల్లి గ్రామ యువతకు వీహెచ్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం రూ. 50 వేల విలువగల పుస్తకాలను పంపిణీ చేసినట్లు వీహెచ్‌ఆర్ ఫౌండేషన్ రామగుండం నియోజకవర్గ ఇంచార్జి రాము తెలిపాడు. కార్యక్రమంలో పల్లె అశోక్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు పందిళ్ల రాజిరెడ్డి, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు చొప్పదండి బుచ్చి లింగయ్య, బీఆర్ఎస్ నాయకులు, వీహెచ్‌ఆర్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బీజేవైఎం, బీజేపీ నేతలపై ఫిర్యాదు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని ప్రగతినగర్‌లోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఉన్న సీఎం కేసీఆర్ ఫ్లెక్సీ ని బీజేవైఎం, బీజేపి నాయకులు చింపివేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ పట్టణ శాఖ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్ శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వాలి

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్‌లోని అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని సమతా సైనిక దళ్ రాష్ట్ర నాయకులు దుర్గం నగేశ్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో భూ నిర్వాసితులకు ఎన్టీపీసీ ఇచ్చిన ఇంటి స్థలాలకు పట్టాలు ఇవ్వాలని,అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని, దళితులకు మూడు ఎకరాల భూమి కేటాయించాలని అన్నారు. ఇంటి స్థలం ఉన్నవారికి ఇల్లు నిర్మాణం కోసం రూ.5 లక్షల రూపాయలు ఇవ్వాలని కోరారు.

రంజాన్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయండి

పెద్దపల్లిరూరల్: రంజాన్ మాసంలో ప్రత్యేక ప్రార్థనలు చేసుకునేందుకు వీలుగా అవసరమైన ఏర్పాట్లు చేయాలని మైనార్టీ నాయకులు శనివారం స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ కుమార్‌దీపక్‌ను కలిసి వినతిపత్రం అందించారు. విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా చూడాలని కోరారు. నాయకులు సయ్యద్ మస్రత్, సర్వర్, మసూద్, సాజిద్, ఖాజా, మెహరాజ్, వకీల్, హకీం, తదితరులున్నారు.

రైతులను ఆదుకోవాలి

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పలు గ్రామాల్లో అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం అందించి రైతులను ఆదుకోవాలని మీర్జంపేట ఎంపీటీసీ గూడెపు జనార్ధన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు తాత రవి యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కాల్వశ్రీరాంపూర్‌లో మాట్లాడుతూ అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను యుద్ధ ప్రాతిపదికన సర్వే చేసి పరిహారం అందించేందుకు స్పష్టమైన ప్రకటన చేసి రైతులకు ఊరట కలిపించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం చిన్న కల్వల(ఉప్పరపల్లి)లో కేతాలమ్మ మేడాలమ్మ సహిత మల్లికార్జునస్వామి ఆలయ పునఃప్రతిష్ఠాపన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి పూజ, పుణ్యహావాచనం, తదితర పూజలను పూజారులు నిర్వహించారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు బుచ్చయ్య, సదయ్య, రవీందర్, గోపాల్, కుమారస్వామి, గుర్రం శ్రీనివాస్, క్రిష్టయ్య పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ శిబిరం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం రాఘవాపూర్‌లో గాయత్రీడిగ్రీ, పీజీ కాలేజీ విద్యార్థులు ఐదు రోజులుగా చేపట్టిన ప్రత్యేక శిబిరంలో శనివారం సర్వే నిర్వహించారు. గ్రామస్తుల్లో అక్షరాస్యులెందరు.. ఉపాధి పనుల వివరాలపై సర్వే నిర్వహించినట్లు ప్రోగ్రాం అధికారి సమద్ తెలిపారు. 15 నుంచి 29 ఏళ్ల లోపు వయస్సుగల వారి ఆదాయ, కుటుంబ సమాచారాన్ని తెలుసుకున్నారు.

క్షయవ్యాధిపై అవగాహన

ధర్మారం: ప్రపంచ క్షయవ్యాధి నిర్మూలన వారోత్సవాల్లో భాగంగా ధర్మారం మండలం మేడారం సాంఘిక సంక్షేమ గురుకులం విద్యాలయంలో శనివారం మేడారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అనుదీప్ ఆధ్వర్యంలో క్షయవ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి అనుదీప్ విద్యార్థులకు క్షయవ్యాధి లక్షణాల గురించి వివరించారు. రెండువారాల పాటు దగ్గు తగ్గకుండ వస్తుంటే వెంటనే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్‌వో కల్లెం రాజారెడ్డి, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

క్రీడామైదానం పరిశీలన

జూలపల్లి: మండలంలోని నాగుల పల్లెలో శనివారం ఎంపీడీవో వేణుగోపాలరావు ఉపాధి హమీలో చేపట్టిన గ్రామీణ క్రీడా మైదానం పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు చేస్తే కూలీ తక్కువ వస్తోందని ఉపాధి హమీ కూలీలు ఎంపీడీవో దృష్టికి తెచ్చారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని, నిబంధనల మేరకు పనులు చేయాలని ఎంపీడీవో కూలీలకు సూచించారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంటు,ఉపాధి సిబ్బంది ఉన్నారు.

చెక్కు అందజేత


చెక్కు అందిస్తున్న జెడ్పీ చైర్మన్ పుట్ట మధు

కమాన్‌పూర్: మండలంలోని రొంపికుంట గ్రామానికి చెందిన గుండేటి రమేశ్‌కు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ. 2 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కును శనివారం జెడ్పీచైర్మన్ పుట్టమధు అందజేశారు. రమేశ్ గత కొద్ది నెలల క్రితం అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందాడు, సాయం కోసం సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా, ప్రభుత్వం నుంచి మంజూరైన చెక్కును అందజేశారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ గుర్రం లక్ష్మిమల్లు, చిందం తిరుపతి, రాసకొండ రవి ఉన్నారు.

పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోండి


మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న విజయరమణారావు

ఓదెల: అకాల వర్షానికి పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం మండలంలోని కొమిర, గూడెం గ్రామాల్లో వర్షానికి దెబ్బతిన్న మొక్కజొన్న పంటలను పరిశీలించారు. వ్యవసాయ అధికారులతో సర్వే చేయించాలని కలెక్టర్ సంగీత, ఏడీఏతో ఫోన్‌లో మాట్లాడారు. నియోజకవర్గంలో 500 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని, పెట్టుబడి చేతికొచ్చే పరిస్థితి లేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి, గుంపుల ఎంపీటీసీ, మాజీ సర్పంచ్ పడాల రాజు, నాయకులు పాల్గొన్నారు.

'ప్రజల ప్రాణాలు తీస్తున్న దోపిడీ దొంగలు'

సుల్తానాబాద్‌రూరల్: తెలంగాణ ప్రభుత్వంలో దోపిడీ దొంగలు ఎక్కువై ప్రజల ప్రాణాలను తీస్తున్నారని బీజేపీ నాయకులు గొట్టిముక్కల సురేశ్ రెడ్డి ఆరోపించారు. సుల్తానాబాద్ మండలం తొగర్రాయిలో శనివారం బీజేపీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. నియోజకవర్గంలో ఇసుకను అక్రమంగా దోపిడీ దొంగలు దోచుకపోతున్నారన్నారు. కార్యక్రమంలో బూత్ అధ్యక్షుడు రమేశ్, నాయకులు శ్రీధర్, శేఖర్, కందుల శ్రీనివాస్, రామస్వామి, భాస్కర్‌రెడ్డి, రజిత, మోహన్ తదితరులున్నారు.

ఇటుకబట్టీ కూలీలకు విముక్తి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం గౌరెడ్డిపేట శివారు ఇటుకబట్టీలో పనిచేస్తున్న కూలీలను యజమానులు నిర్బంధించారంటూ అందిన ఫిర్యాదుపై సీఐడీ అధికారులు స్పందించారు. హైదరాబాద్‌లోని సీఐడీ విభాగం డీజీపీ ఆదేశాలతో రీజియన్ డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇన్స్‌పెక్టర్, సబ్ఇన్స్‌పెక్టర్, సిబ్బంది ఇటుక బట్టీలను శనివారం సందర్శించారు. అక్కడున్న నలుగురు కూలీలు గోవర్ధన్‌నాగ్, అతని భార్య అహల్యనాగ్ వారి నలుగురు పిల్లలు, సురేంద్రమాలిక్, అతని భార్య ఉమావతిమాలిక్‌ను వారి స్వస్థలాలకు పంపించామని డీఎస్పీ శ్రీనివాస్ తెలిపారు.

ఉజ్వల భవిష్యత్తుకు నాంది కావాలి

సుల్తానాబాద్: విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తు కోసం లక్ష్య సాధన దిశగా చదవాలని వివేకానంద ఉన్నత పాఠశాల వ్యవస్థాపకులు బాలకిషన్ ప్రసాద్ అన్నారు. శనివారం పట్టణంలోని వివేకానంద పాఠశాలలో శనివారం రోజున ఫేర్‌వేల్‌డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయనమాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు పాటు క్రమశిక్షణ కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉమారాణి, డైరెక్టర్ భూసారపు రవీందర్, సుజాత ప్రిన్సిపాల్ మధుసూదన్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ చందు, విద్యార్థులు పాల్గొన్నారు

20న సర్వసభ్య సమావేశం

సుల్తానాబాద్: సుల్తానాబాద్ సొసైటీలో ఈ నెల 20వ తేదీన పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు సొసైటీ కార్యదర్శి బూరుగు సంతోష్ కుమార్ తెలిపారు.

20 న ఇంటర్వ్యూలు

రామగిరి: దివ్యాంగుల సబ్సిడీ రుణాల లబ్ధిదారుల ఎంపిక కోసం ఈనెల 20న మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఇనుముల రమేశ్ తెలిపారు.

ఘనంగా పోచమ్మ బోనాలు


బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ వీర్లపల్లిలో గ్రామ దేవతల కొలుపులు, పోచమ్మ బోనాలను శనివారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. పోచమ్మకు బోనం చెల్లించేందుకు గ్రామస్తులు ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

చిన్నబొంకూర్‌లో..

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం చిన్న బొంకూర్‌లో గ్రామస్తులు శనివారం పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. డప్పు చప్పుళ్లతో ఇంటికో బోనం చొప్పున మహిళలు బోనంను పోచమ్మకు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా హిజ్రాల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సర్పంచ్ రాజు, కార్యదర్శి నిశాంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

'మంత్రి కేటీఆర్‌ను బర్తరఫ్ చేయాలి'

పెద్దపల్లిరూరల్: టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన గ్రూప్ ప్రశ్నాపత్రాలు లీకేజీకి కారకుడైన మంత్రి కేటీఆర్‌ను వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు దేవేందర్, బీజేపీ మండల అధ్యక్షుడు పర్శ సమ్మయ్య డిమాండ్ చేశారు. స్థానిక ప్రగతినగర్ చౌరస్తావద్ద రాజీవ్ రహదారిపై శనివారం రాస్తారోకో చేశారు. తెలంగాణ తల్లి విగ్రహానికి వినతిపత్రం అందించారు. అక్రమాలకు నిలయమైన టీఎస్‌పీఎస్సీ బోర్డును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు వెల్లంపల్లి శ్రీనివాసరావు, పల్లె సదానందం, జంగ చక్రధర్‌రెడ్డి, ఎండీ.ఫహీం, శివంగారి సతీశ్, నరేశ్, విజయ్, కుమార్ తదితరులున్నారు.

ఫ్లెక్సీ తొలగింపుపై రగడ...

తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని తొలగించేందుకు బీజేపి నాయకులు యత్నించగా బందోబస్తుకు వచ్చిన ఎస్సై సహదేవ్‌సింగ్ ఇతర పోలీసుసిబ్బంది వారిని అడ్డుకున్నారు. కొంతసేపు తోపులాట జరిగింది. కొందరు నాయకులు అందుబాటులో ఉన్న కర్రలతో ఫ్లెక్సీని చించి కిందపడేశారు.